క్లుప్తంగా...

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

బోడుప్పల్: బోడుప్పల్ నుంచి చిలుకానగర్ వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ 20వ డివిజన్ కార్పొరేటర్ జడిగె మహేందర్‌యాదవ్ సోమవారం కమిషనర్ వాణిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి చిలుకానగర్ వరకు వెళ్లే రహదారి గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించడం కష్టంగా ఉంది. ఈ విషయం పలుమార్లు కమిషనర్, మేయర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. నిధులు వెంటనే మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలని, లేదంటే ఈనెల 29వ తేదీన కాలనీ ప్రజలతో కలిసిన నిరసన చేపడతామని వినతిలో పేర్కొన్నారు.

వార్షిక సర్వేలు ప్రభుత్వానికి ఉపయోగకరం



మాట్లాడుతున్న అధికారి

కుషాయిగూడ: ప్రతి ఆర్థిక సంవత్సరం పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి అందజేసే పరిశ్రమల వార్షిక సర్వే ప్రభుత్వానికి తోడ్పాటు అందిస్తుందని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ తెలంగాణ రాష్ట్ర రీజనల్ హెడ్, స్టాటిస్టిక్స్ ఆఫీసర్ డి.సతీష్ పేర్కొన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని సీఐఏ ఆడిటోరియంలో భారత ప్రభుత్వ గణాంక, పథకాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీసు అధికారులు వార్షిక సర్వేపై శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పారిశ్రామిక గణాంకాలకు ప్రధాన మూలాధారమైన వార్షిక సర్వేపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. పారిశ్రామికవేత్తలు అందజేసే వార్షిక సర్వే ఆధారంగానే స్థూల దేశీయోత్పత్తికి పారిశ్రామికరంగ సహకారాన్ని అంచనా వేయడానికి, పారిశ్రామిక అభివృద్ధి, విధానాలను రూపొందించడంలో ప్రభుత్వానికి ఉపకరిస్తుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌ఓ ప్రాంతీయ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతిరెడ్డి, ఐలా చైర్మన్ రోషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ జోష్

ఉప్పల్: ఐపీఎల్ మ్యాచ్‌లకు ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదిక కావడంతో అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. క్రికెట్‌ను తిలకించేందుకు నగరవాసులు స్టేడియం వైపు పరుగులు తీశారు. సోమవారం సన్ రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు అభిమానులు భారీగా తరలివచ్చారు.

బాల శ్రీనివాసమూర్తి మృతి తీరని లోటు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు ఆచార్య గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి మృతి తెలుగు సాహిత్య ప్రపంచానికి తీరని లోటని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితచరిత్ర, ఆత్మకథలో అలనాటి తెలంగాణ గ్రంథాల ద్వారా సాహిత్యంపై తనదైన ముద్రవేసిన సహృదయ సాహితీవేత్త బాలశ్రీనివాసమూర్తి అన్నారు. వారి మృతికి అశ్రునివాళి అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వచ్చే నెల 3న జెడ్పీ సమావేశం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం మే 3వ తేదీన ఉదయం 11 గంటలకు చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జరగనున్నట్లు జెడ్పీ సీఈఓ దేవసహాయం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ముఖ్యఅతిథులుగా జిల్లా మంత్రి మల్లారెడ్డి, ఎంపీ రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు.

కీసర ఇన్‌చార్జి ఎంపీడీఓగా లక్ష్మీవత్సలదేవి

కీసర: కీసర మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా మూడుచింతలపల్లి మండలం ఎంపీడీఓ కె.లక్ష్మీవత్సలదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.లక్ష్మీవత్సలదేవిని కీసర మండల ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, మండల పరిషత్ సిబ్బంది, వివిధ గ్రామాల కార్యదర్శులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మొన్నటి వరకు కీసర ఎంపీడీఓగా విధులు నిర్వర్తించాలని రమాదేవి ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం విధితమే.

చలివేంద్రం ప్రారంభం

మేడ్చల్: గౌడవెల్లి పరిధిలో ఔటర్‌రింగు రోడ్డు సర్వీసు రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ ప్రారంభించారు. పీజేఎస్ పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. చలివేంద్రం సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు ప్రార్థనలు చేశారు.

ఆటాడుకుందాం రా..!

వేసవి సెలవుల్లో విద్యార్థులకు నెల రోజుల ఉచిత శిక్షణ



- మే 1 నుంచి 31 వరకు 14 ఏళ్లలోపు చిన్నారులకు..
- నిపుణులైన పీఈటీలతో మెరుగైన శిక్షణకు ఏర్పాట్లు
- ఈ వేసవిలో ఉద్యోగులకు కూడా అవకాశం
- ప్రభుత్వం నుంచి జిల్లాకు రూ.1.05 లక్షల మంజూరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: వేసవి సెలవుల్లో విద్యార్థులకు నెల రోజుల పాటు ఉచితంగా క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 31 వరకు చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో అనుభవజ్ఞులైన క్రీడాకారులు, పీఈటీల పర్యవేక్షణలో 10 శిబిరాల ద్వారా శిక్షణ అందించనున్నారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలోనే నెల రోజుల వరకు వివిధ క్రీడాంశాలతోపాటు గ్రామీణ క్రీడలపై శిక్షణ ఇస్తారు. వేసవిలో ఇళ్లలో ఖాళీగా ఉండే పిల్లలకు ఇది చక్కటి అవకాశంగా వినియోగించుకోవాలని కోరుతున్నారు.

సమయం వృథా కాకుండా..

14 ఏళ్లలోపు బాలబాలికలు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు అర్హులు. వేసవి సెలవులు వృథా కాకుండా వారికి ఇష్టమైన ఆటల్లో ప్రత్యేక శిక్షణ కల్పించనున్నారు. ఆధునిక యుగంలో పిల్లలు స్మార్ట్ ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి, చిన్న వయసులోనే అనారోగ్యాలు కొనితెచ్చుకుంటున్నారు. సెలవులను గ్రామీణ, పట్టణ ప్రాంతం పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కొన్నేళ్లుగా ఏటా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల ఆవరణ, అందుబాటులో ఉన్న మైదానాలు, క్రీడా ప్రాంగణాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

ఉద్యోగులకు కూడా...

ఈ వేసవి సెలవుల్లో ఉద్యోగులకు కూడా వివిధ క్రీడాంశాల్లో శిక్షణతో సహా ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించడంతో పాటు వారిలో మానసిక ఉల్లాసాన్ని, శరీర దారుఢ్యాన్ని పెంపొందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందులో భాగంగా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులను వేసవి క్రీడల్లో భాగస్వాములను చేయాలని భావిస్తోంది. మహిళా ఉద్యోగులను కూడా ఈ క్రీడాంశాల్లో భాగస్వాములను చేస్తారు.

నిధుల కేటాయింపు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.05 లక్షల నిధులు కేటాయించింది. క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.50 వేలు, ఒక్కో కోచ్‌కు రూ.4 వేల చొప్పున, మొత్తం జిల్లాలో పది శిక్షణ శిబిరాలు నిర్వహించుకునేందుకు రూ.40 వేలు కోచ్‌లకు గౌరవ వేతనం కోసం కేటాయించారు. ప్రమాదంలో గాయాలైతే ప్రాథమిక చికిత్స అందించేందుకు మెడికల్ కిట్‌కు రూ.5 వేలు, ఇతరత్రా నిర్వహణకు రూ.10 వేలు ఖర్చు చేయనున్నారు.

నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవచ్చు..

ఆటలకు దూరమైన పాఠశాలలకు చెందిన పిల్లలు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే క్రీడా నైపుణ్యాన్ని మరింత మెరుగు పర్చుకోవచ్చు. ముఖ్యంగా వేసవిలో సమయం వృథా కాకుండా ఇష్టమైన ఆటను నేర్చుకుని పట్టుసాధించే అవకాశం ఉంటుంది. సమయ పాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవాటు, ఆటలు ఆడుకునే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారు. భవిష్యత్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశాలుంటాయి. ఈ క్రీడల్లో పతకాలు సాధిస్తే క్రీడా కోటా కింద ఉన్నత విద్య అభ్యసించవచ్చు. ఉపాధి అవకాశాలకు కూడా ఆ పతకాలు ఎంతో ఉపయోగపడుతాయి.

అన్ని వసతులు కల్పిస్తాం

వేసవి దృష్ట్యా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడా శిక్షణ శిబిరాల్లో చిన్నారులకు అన్ని వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటలు నిర్వహిస్తారు. ఇప్పటికే కోచ్‌ల నియామకం కోసం ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. శిక్షణ శిబిరాల్లో తాగునీరు, తదితర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. మెడికల్ కిట్లు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవాలి. ఉద్యోగులను కూడా వివిధ క్రీడాంశాల్లో భాగస్వాములను చేసేందుకు అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్నాం.

– బి.బలరామారావు, జిల్లా యువజన క్రీడల అధికారి, మేడ్చల్ జిల్లా

వార్డు కార్యాలయానికి నిధులివ్వండి



కమిషనర్ పంకజకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ వార్డు కార్యాలయానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ వినతి పత్రం అందజేశారు. కార్తికేయనగర్ వీధి నంబర్– 9, 10, రాఘవేంద్రనగర్‌లో చిన్న వర్షానికి వరద నీరు నిలుస్తోందని, వర్షపు డ్రైన్ కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ కోరారు. త్వరలోనే నాచారం ఓల్డ్ విలేజ్‌లోని వార్డు కార్యాలయం స్థలంలోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు కమిషనర్ తెలిపినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లోని అన్ని కాలనీల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని కొకూర్ ధరణి ఎన్‌క్లేవ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ మల్లికార్జున్, జీహెచ్‌ఎంసీ డీఈ మహేష్, నాయకులు వెంకటేష్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, శ్రావణ్ ముదిరాజ్, వెంకటేష్, కాలనీవాసులు మాధవరెడ్డి, సూర్య వెంకటరత్నం, మల్లికార్జున్, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేష్ యాదవ్, హనుమాన్‌చారి, శంకుతల నాయుడు, కవిత, కృష్ణవేణి తదితరులు ఉన్నారు.



కొకూర్ ధరణి ఎన్‌క్లేవ్‌లో పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల సంక్షేమం



వెంకటాపురం కొత్తబస్తీలో పాదయాత్ర చేస్తున్న నందికంటి శ్రీధర్

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని కొత్త బస్తీలో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500 వందలకే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. నిరుపేదలకు ఇళ్ల నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ బి బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి, నాయకులు కృష్ణగౌడ్, సూర్యప్రకాష్‌రెడ్డి, పవన్, శ్రీనివాస్, సాయికుమార్, శ్రీనివాస్, అంబ, రామానుజన్, మార్షల్, సంతోష్‌రెడ్డి, నవీన్, మేరీ, పద్మ, నిర్మల, లక్ష్మీ, వాణి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లు ఎత్తేస్తామనడం హేయం

కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

బోడుప్పల్: దేశంలో ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా చెప్పడం అభ్యంతరకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో బోడుప్పల్ ఇందిరానగర్ కాలనీలో సోమవారం చేపట్టిన ఇంటింటికీ సీపీఐ పాదయాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాగానే ధరలు విపరీతంగా పెరిగాయని మండిపడ్డారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించకపోగా, పేదలపై పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల భారం మోపిందన్నారు. బోడుప్పల్ పెదకంచెలో ల్యాండ్ పూలింగ్ చేపట్టి లబ్ధిదారులకు ఎకరాకు 1000 గజాల స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, వక్ఫ్ బోర్డు భూముల్లో లబ్ధిదారులను క్రమబద్ధీకరించాలని కోరారు. కొంత మంది అధికారులు బీఆర్‌ఎస్ పార్టీకి ఏజెంట్లుగా మారి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో బీజేపిని ఓడించి వామపక్ష, ప్రగతిశీల లౌకిక, ప్రజాస్వామ్య శక్తులతో కూడిన ప్రభుత్వం ఏర్పడేవరకు పోరాటం ఆపబోమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్, పి.పద్మ, రాష్ట్ర నేతలు పల్లె నర్సింహ్మ, అనిల్ కుమార్, శ్రీమాన్, పుట్ట లక్ష్మణ్, కె.ప్రమీల, దండు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్



కుషాయిగూడ: కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చిన బి.ప్రవీణ్‌కుమార్ సోమవారం ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. మొన్నటి వరకు విధులు నిర్వర్తించిన ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఇరువురికి వీడ్కోలు, స్వాగత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యం ఉంటేనే కేసులు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. ఆ దిశగా అందరికీ అవగాహన కల్పించి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: డివిజన్ పరిధిలోని కృష్ణనగర్‌లో సీసీ రోడ్డు పనులు, హనుమాన్‌నగర్‌లో పైపులైన్ పనులను సోమవారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తామన్నారు. సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో స్వాతి, శశికళ, లక్ష్మమ్మ, శివ, నాటరాజ్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఐజీకే కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం



మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: ఇందిరా గృహకల్ప(ఐజీకే) కాలనీ అభివృద్ధికి పూర్తి తోడ్పాటు అందిస్తామని గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ఐజీకే కాలనీలో ఆదివారం నిర్వహించిన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికైన సంక్షేమ సంఘం ప్రతినిధులంతా సమష్టిగా కృషిచేసి కాలనీని అభివృద్ధి పథంలో నిలిపే దిశగా కార్యచరణ చేసుకోవాలన్నారు. సమన్వయకర్తలుగా పనిచేసి కాలనీ అవసరాలను స్థానిక కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం అధ్యక్షుడు ముత్యాలు, ఉపాధ్యక్షుడు ఎస్.కె. నజీర్, వై.సత్తెమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనుముల వెంకట్‌రెడ్డి, తన్వీర్, కోశాధికారిగా సీహెచ్. శ్యామ్, కొండయ్య, నరసింహ, సాంబయ్య, చీఫ్ అడ్వైజర్‌గా అనిల్‌గౌడ్, నరసింహరెడ్డి, సెక్రటరీగా వి. కృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, ప్రభుగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, రాజుగౌడ్, లక్ష్మారెడ్డి, సంపత్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన..

డివిజన్ పరిధిలోని వీఎన్‌రెడ్డినగర్ కాలనీలో చేపట్టిన నాలా పూడికతీత పనులను సోమవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరిశీలించారు. డివిజన్ పరిధిలోని అన్ని నాలాల పూడికతీత పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. అధికారులు పనులను పర్యవేక్షించి పూడికతీత పనులు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఆమె వెంట ఇంజనీరింగ్ ఏఈ స్వరూప వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఎన్‌జీఆర్‌ఐలో ఎర్త్ డే

ఉప్పల్: భూమి లోపల, బయట జరిగే మార్పులను ఎప్పటికప్పుడు తెలియజేసేదే జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ ఎన్‌జీఆర్‌ఐ అని, ఇది భూమికి జ్వరమానిని వంటిదని సంస్థ డెరెక్టర్ డా. ప్రకాశ్ కుమార్ తెలిపారు. భకంపాలు వాటి తీవ్రత, నీటి లభ్యత, వాతావరణ మార్పులు, ఖనిజాల ఉనికి, తదితర అంశాలను తెలియజేస్తూ మానవాళికి ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఉప్పల్ జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(సిఎస్ఐఆర్ – ఎన్‌జీఆర్ఐ) ఆధ్వర్యంలో క్లైమేట్ క్లాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించుకుంది. నగరానికి చెందిన వివిధ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువ శాస్త్ర వేత్తలు, ఎన్‌జీఆర్‌ఐ సీనియర్ సైంటిస్టులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్ డా.ప్రకాశ్ కుమార్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. ఎన్‌జీఆర్ శాస్త్రవేత్తల బృందం డా.తన్వి అరోరా, డా. డి.విజయ కుమార్, డా.బిస్వజిత్ మోండల్, సతీష్ చంద్రపురి, డా.రాజీవ్ యాదవ్ ఉన్నారు.



ఉప్పల్ ఎన్‌జీఆర్‌ఐలో విద్యార్థులు, సైంటిస్టులు తదితరులు

నేడు బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభ

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: మంగళవారం నిర్వహించే నియోజకవర్గ పార్టీ ప్రతినిధుల సభను జయప్రదం చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీసాయి గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని జిల్లా పార్టీ అధ్యక్షుడు శంబీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది డివిజన్లలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పార్టీ జెండా ఎగురవేసిన అనంతరం సభకు తరలిరావాలన్నారు. ఉద్యమకారులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు.

క్రికెట్ అభిమానుల నుంచి మెట్రో పార్కింగ్ దోపిడీ



ఉప్పల్ స్టేడియం వద్ద పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న మెట్రో సిబ్బంది



ఉప్పల్ స్టేడియం వద్ద నడక దారిలో పార్కింగ్

ఉప్పల్: ఉప్పల్ ఐపీఎల్ మ్యాచ్‌లు మెట్రో పార్కింగ్‌కు కలిసొచ్చింది. పార్కింగ్ పేరిట అందిన కాడికి దండుకుంటూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్ సందర్భంగా సందంట్లో సడేమియాలా మెట్రో సిబ్బంది క్రికెట్ అభిమానుల నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. ఉప్పల్ స్టేడియం, హబ్సిగూడ మెట్రో స్టేషన్ల వద్ద ఎన్‌జీఆర్‌ఐ పార్కింగ్‌ల వద్ద రహదారిపై పార్కింగ్ చేయిస్తూ అభిమానుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారు.

ఒక్కో ద్విచక్ర వాహనానికి రూ.25 నుంచి రూ.40 వరకు, కార్లకు రూ.100 వరకు వసూలు చేస్తున్నట్లు అభిమానులు ఆరోపించారు.

పట్టణ ప్రగతి పనుల సంగతేంటి..?

ఎమ్మెల్యే, అధికారులను ప్రశ్నించిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి



పట్టణ ప్రగతి సమస్యల సంగతేంటని ఎమ్మెల్యే, అధికారులను నిలదీస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పబ్లిక్ ఇంట్రాక్షన్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ఉప్పల్ డివిజన్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రారంభించారు. సమస్యలు తెలుసుకుంటూ వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి తనదైన శైలిలో ఎమ్మెల్యేతో పాటు అధికారులను నిలదీశారు. పట్టణ ప్రగతిలో నివేదించిన సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయని వాటి సంగతేంటని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడం తప్ప కొత్తగా ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. దీంతో కల్పించుకున్న ఎమ్మెల్యే త్వరలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీ అరుణకుమారి, జలమండలి మేనేజర్ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నేతలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ఉప్పల్ రాఘవేంద్రానగర్ కాలనీ రూ.36.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈఈ నాగేందర్, ఏఈ వసంత, బూత్కూరి శ్రీరాములు, అంజిరెడ్డి, గండు భాస్కర్, నరహరి, నవీన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.